క్లుప్తంగా

నేడు జియారత్ వేడుకలు



సొదరదిన్నెలో జియారత్‌కు ముస్తాబైన బాదుల్లాస్వామి పీరు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ, మండలంలోని సొదరదిన్నె గ్రామాల్లో గురువారం జియారత్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. మొహర్రం పండుగ ముగిసి 40 రోజులు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని పెద్దబార్ ఇమాం, మండలంలోని సొదరదిన్నెలో బాదుల్లా స్వామి పీర్ల జియారత్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జార్తలను పురస్కరించుకుని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పీర్లకు ఫతేహాలు సమర్పించనున్నారు. ఆయా చావిళ్ల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

దేశాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం



నమూనా ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల: మారుతున్న కాలనుగుణంగా దేశ పురోభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం అని సరస్వతి శిశు మందిర్ పాఠశాల కమిటీ సభ్యులు, పారిశ్రామిక వేత్తలు హుసేన్ రెడ్డి, మారుతి శర్మ, మధు మోహన్ రెడ్డి రమణారెడ్డి, పుల్లారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ మాధ్యమిక పాఠశాలలో కర్నూలు, నంద్యాల జిల్లా స్థాయి సైన్స్ విజ్ఞాన మేళా ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు సేంద్రియ వ్యవసాయం, వ్యర్థ వస్తువుల ఉపయోగం, గ్యాస్, సోలార్ విద్యుత్, డ్రోన్ ద్వారా మందుల పిచికారీ తదితర నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు.

నీటి కుంటల్లో చేపల విడుదల



గంబూషియా చేపలను విడుదల చేస్తున్న జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ రావు

బేతంచెర్ల: దోమల నియంత్రణకు మంచి నీటి కుంటల్లో గంబుషియా చేపలను వదులుతున్నట్లు జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ రావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గోరుమానుకొండ, మర్రికుంట, ఎం.పెండేకల్లు గ్రామాల్లోని మంచినీటి కుంటల్లో సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యులు అబ్దుల్ అలీం ఆధ్వర్యంలో గంబూషియా చేపలు వదిలారు. వారు మాట్లాడుతూ.. ఈ చేపలు దోమల లార్వాలను తింటాయని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. అలాగే సమీప గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, బోధకాలు వంటి వ్యాధులు నివారించవచ్చన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డోన్ టౌన్: రైతు సుభిక్షంగా ఉంటనే దేశం బాగుటుందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుపై రైతు సంబరం పేరుతో బుధవారం పట్టణంలో ఎండ్ల బండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో సమావేశం నిర్వహించారు.

శుభకార్యం

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త దస్తగిరి రెడ్డి కుమారుడి వివాహం బెంగళూరు నందిహిల్స్‌లోని అమితా రసా ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగింది. శుభకార్యంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

బీసీ హాస్టళ్ల సంక్షేమ అధికారుల సంఘం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

సంజామల: వెనుకబడిన తరగతుల వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా మునిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా నగర్ బీసీ కళాశాల వసతి గృహంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి, ట్రెజరర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల జిల్లా బీసీ వసతి గృహ సంక్షేమ అధికారుల నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా మునిరాజు (సంజామల బీసీ హాస్టల్), జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ షబ్బీర్ ఉస్సేన్ (నందికొట్కూరు బీసీ కళాశాల వసతి గృహం), ట్రెజరర్‌గా మేరీ సూర్య కుమారి (డోన్ బీసీ కళాశాల వసతి గృహం), కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ నాయక్, వెంకటపతి, వెంకన్న గౌడ్, ఇక్బాల్, సురేష్ తదితరులను ఎన్నుకున్నారు.

యూరి‘యాతన’

- యూరియా కోసం రైతులు ఎదురుచూపులు
- గద్దల్లా తన్నుకుపోతున్న టీడీపీ నాయకులు
- బయట మార్కెట్‌లో అధిక ధరకు విక్రయం
- యూరియా కోసం ఆకుమల్ల టీడీపీలో రెండు వర్గాల మధ్య విభేదాలు
- నో స్టాక్ అంటున్న ఎరువుల దుకాణాలు



ఆకుమల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం

సంజామల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు రెండున్నర నెలలు గడిచినా రైతులకు కనీసం ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. సంజామల మండలంలో ఎస్‌ఆర్‌బీసీ కాల్వలు, ముక్కమల్ల చెరువు, రామభద్రుని పల్లె చెరువు, పాలేరు వాగు, గొంద్రవాగు కింద పలువురు రైతులు వరి, మొక్కజొన్న, మినుము, పత్తి, కంది తదితర పంటలు సాగు చేశారు. మండలంలో ఖరీఫ్ పంటల సాగు సాధారణ విస్తీర్ణం 11,637 ఎకరాలు కాగా ఇప్పటివరకు 5271 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అయితే పైరు ఎదుగుదలకు ప్రధానమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెంతున్నారు.

అధికారులు మాత్రం రైతులకు సకాలంలో యూరియా అందిస్తున్నామని చెబుతుండటం గమనార్హం.

టీడీపీ నాయకులకు ఫుల్.. రైతులకు నిల్

మండలంలో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. అయితే తెలుగుదేశం నాయకులకు మాత్రం యూరియా ఫుల్‌గా దొరుకుతుంది. రైతు సేవా కేంద్రాలకు అరకొరగా వచ్చిన యూరియా బస్తాలను టీడీపీ నాయకులే మొత్తం తీసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. యూరియా కోసం ఆకుమల్ల గ్రామంలో టీడీపీలోని రెండు వర్గాలు పరస్పరం దూషణలు చేసుకుని కేసులు పెట్టుకునే వరకు వెళ్లారు.

ఇతర ఎరువులతో లింక్

బయట మార్కెట్ యూరియా తీసుకోవాలంటే ముందు నో స్టాక్ అంటారు. తరువాత ఒక యూరియా బస్తాకు ఇతర ఎరువులు మందులు, లేదా యూరియా లిక్విడ్ కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. యూరియా బస్తా రూ.350 నుంచి రూ.400 పెట్టి కొనుగోలు చేసి తర్వాత అవసరం లేని మందులను కూడా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే రైతు సేవా కేంద్రానికి ఎప్పుడో ఒకసారి వచ్చే యూరియా బస్తాలను టీడీపీ నాయకులే పోటీ పడి తీసుకెళుతున్నారు. దీంతో సాధారణ రైతుకు యూరియా దొరకడం లేదు. యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నా వ్యవసాయ అధికారులు మాత్రం చర్యలు తీసుకుంటాం అనే ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో నామమాత్రపు తనిఖీలు చేయడం, నిర్వాహకులు ఇచ్చిన బహుమతులు తీసుకోవడం అలవాటుగా మారిందని రైతులు విమర్శిస్తున్నారు.

మండలంలో ఖరీఫ్‌లో సాగైన పంటల వివరాలు

పంట పేరు	సాగు చేసిన విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	304
మొక్కజొన్న	3584
మినుము	410
కంది	134
పత్తి	564
ఇతర రకాలు	275

సహకార సంఘాలు ఎందుకు?

సంజామల మండలంలో సంజామల, ఆకుమల్ల, పేరుసోముల గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. సంజామల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో దాదాపు 20 రోజుల నుంచి ఎరువుల కొరత ఉంది. ఆకుమల్ల, పేరుసోముల సంఘాలలో ఎరువుల మాటే వినపడదు. ఈ సంఘాలు నామమాత్రమేనని, రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

యూరియా దొరకడం లేదు



నేను తొమ్మిది ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. పైరు ఎదుగుదలకు యూరియా ఎంతో అవసరం. కోవెలకుంట్ల, పేరుసోముల తదితర ప్రాంతాలు తిరిగి ప్రయత్నించినా యూరియా దొరకలేదు. రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సంఘాలు ఎందుకున్నాయి. రైతుకు ఉపయోగపడని సంఘాలు ఎన్ని ఉంటే ఏమి చేస్తాం. గతంలో అన్ని రకాల ఎరువుల దొరికేవి. రైతులకు కనీసం ఎరువులు కూడా సరఫరా చేయలేని పరిస్థితి ఉంది.

– జలంధర్‌రెడ్డి, రైతు, రెడ్డిపల్లె గ్రామం

ఆరెకరాల్లో పత్తి సాగు చేశా..



ఈ ఏడాది యూరియా ఎక్కడా దొరకడం లేదు. నేను ఆరు ఎకరాలలో పత్తి, రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. నొస్సం సచివాలయ పరిధిలో యూరియా అనే మాటే వినపడటం లేదు. యూరియా దొరకకపోవడంతో ఇతర ఎరువులు వేస్తున్నాం. తద్వారా పెట్టుబడి ఖర్చు ఎక్కువగా వస్తుంది. కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్నీ నష్టాలే.

– అనిపి నాగిరెడ్డి, రైతు, అక్కంపల్లె గ్రామం

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

డోన్: పచ్చదనంతోనే పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని వివేకానంద సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌మోహన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు, అధ్యాపకులచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాంత్రిక జీవితంలో మానవ మనుగడకు చెట్ల పెంపకం ఎంతో అత్యవసరమన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించుకునే బాధ్యతను తీసుకున్నట్లయితే మనిషి జీవన ప్రమాణం మరింత మెరుగుపడుతుందని ఆయన ఉద్బోధించారు. అధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, కార్యదర్శి వంకదారి శ్రీనివాసులు, సభ్యులు కుళ్లాయప్పతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

భక్తిశ్రద్ధలతో మహా నారాయణ హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెలో జీర్ణోద్ధరణ గావించిన విష్వక్సేన, ఆంజనేయ, జనార్ధన స్వామి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. పురాతన ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో పునఃప్రతిష్ఠించారు. ప్రతిష్ఠలో భాగంగా రెండవ రోజు బుధవారం ప్రాతఃకాల పూజ, యంత్ర అభిషేకం, మూలమంత్ర జప అనుష్ఠానములు, జనార్ధనస్వామికి ప్రీతిగా మహా నారాయణ హోమం, మంగళహారతి నిర్వహించారు. విగ్రహాలతో గ్రామోత్సవం, సాయంత్రం మహాస్నపనం, 108 కలశాలచే విశేష అభిషేకాలు, ప్రదోశకాల పూజ, ధాన్యాధివాసం, నవగ్రహ వాస్తుభద్ర మండల హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆయా కాలనీలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. గురువారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠతో ఉత్సవాలు ముగుస్తాయని సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా




కోవెలకుంట్లలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కోవెలకుంట్ల: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో గేటు ఎదుట బుధవారం ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివరాం మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని, రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్మెంట్ వర్తింప చేయాలన్నారు. ఎన్ఎంయూ నాయకులు నరసింహులు, ఆచారి, రాముడు, పీకే ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

- **బనగానపల్లె:** పలు సమస్యల సాధనకై బనగానపల్లె ఆర్టీసీ డిపో ప్రాంగణంలో రెండవ రోజు బుధవారం ఎస్ఎంయూఏ ఆర్టీసీ కార్మికులు గేట్ ధర్నా నిర్వహించారు. డిపో రీజనల్ కమిటీ సభ్యులు ఎస్ఎస్ వలి, రాష్ట్ర ఉపకార్యదర్శి భద్రవతి మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు చేపట్టాలని, పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక

బనగానపల్లె రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో అన్నిశాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక సూచించారు. బుధవారం స్థానిక పొదుపు భవనంలో ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన పంచాయతీల పురోగతి సూచిక, వెర్షన్ 2.0కు అప్‌డేట్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు సక్రమంగా జరిగేలా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలను తయారు చేసి వాటిని ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ గురుప్రసాద్, శంకర్‌నాయక్, వేదవతి గ్రామ పంచాయతీల పురోగతికి ప్రాధాన్యతగా తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలాంజనేయులు, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీఎం ప్రతాప్, డీఆర్‌డీఏ ఏపీఎం హజరత్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మోనిక, సోహెల్‌బాబు, పశు వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ

బనగానపల్లె రూరల్: బనగానపల్లె జెన్‌స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన పది మంది విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక కావడంతో బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఎస్.నిహరా, డి.శ్రీదిత్య, టి.దివ్య, ఎ.నాగసత్విక్, డి.నవదీప్‌యాదవ్, ఆర్.బాలాజీ, కె.సాయిచరణ్‌తేజ, అనిల్‌కుమార్, చైతన్యరెడ్డి, ఎస్.తమీమ్‌రాజా పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయస్థాయి పోటీల్లోనూ వారు ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.



జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులతో బీసీ రాజారెడ్డి

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి కడప జిల్లా దువ్వూరు గ్రామానికి చెందిన చల్లా మురళీకృష్ణ ఆయన సతీమణి నిర్మల కుటుంబ సభ్యులు రూ.25,001 విరాళం అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు దాత కుటుంబ సభ్యులను పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేసినట్లు చెప్పారు. దాత కుమారుడు చల్లా కార్తీక్‌రాజ్, సతీమణి లిఖిత పాల్గొన్నారు.

నేడు మండల మీట్

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే మండల మీట్‌లో విద్య, వైద్యం, గృహ నిర్మాణ శాఖ, వ్యవసాయం, స్త్రీ, శిశు సంక్షేమం, పశు వైద్యం, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, వెలుగు, తదితర శాఖల పురోగతిపై సమీక్ష ఉంటుందన్నారు. ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

15న రక్తదాన శిబిరం

డోన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం స్థానిక పోలీసుస్టేషన్ రోడ్డులోని శ్రీసుధ బాయ్స్ క్యాంపస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ద్రోణాచలం సేవా సమితి ఒక ప్రకటనలో తెలిపింది. కర్నూలు సర్వజన వైద్యశాలలో రక్తహీనతతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వందలాది మంది చిన్నారుల అవసరాల కోసం రక్తాన్ని సేకరించి అందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని సమితి ప్రతినిధి తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

16న కృష్ణాష్టమి వేడుకలు

కొలిమిగుండ్ల: మండలంలో ఈనెల 16న కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంకిరెడ్డిపల్లెలోని గీతాశ్రమంలో 29వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, గీతాపారాయణం పఠించనున్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు.అలాగే నాయినపల్లె, కొలిమిగుండ్లలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిపేందుకు సన్నాహాలు చేసుకున్నారు. బెలుం బస్టాప్ సమీపంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో వేడుకలు నిర్వహించనున్నారు. నెల్లూరు జిల్లా సిద్ధేశ్వరంకు చెందిన సిద్ధిజ్ఞానం పీఠాధిపతి చైతన్యానందస్వామి ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రబోధనందస్వామి ఆశీస్సులతో ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మీర్జాపురం, బందార్లపల్లె తదితర గ్రామాల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

డోన్: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో పాటు ఎంపీటీసీ సభ్యులు, మార్కెట్‌యార్డు, సింగిల్ విండో చైర్మన్‌లు, అధికారులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

బేతంచెర్ల: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి కుటుంబాలకు అండగా నిలవాలని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండా అశ్వర్థనారాయణ, రాజేష్ సూచించారు. బుధవారం పట్టణంలోని రోటరీ క్లబ్ సహకారంతో ముగ్గురు మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు గుండా గోపాల్, మద్దిలేటిస్వామి, ప్రేమ స్వరూప్, సుబ్బారెడ్డి, వీరారెడ్డి, అహ్మద్ హుసేన్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

బేతంచెర్ల: పట్టణంలో ఈ నెల 16, 17 తేదీల్లో జనసేవాదళ్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సీపీఐ శత వార్షికోత్సవాలను ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో నిర్వహించే రాష్ట్ర మహాసభల సందర్భంగా బేతంచెర్ల పట్టణంలో జనసేవాదళ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరానికి రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు.

త్యాగధనులను స్మరించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

డోన్: దేశానికి స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆర్‌డీఓ నరసింహుడు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో మెప్మా, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట జరిగిన సమావేశం గురించి ఆర్‌డీఓ మాట్లాడారు. ఎందరో మహనీయులు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు కోల్పోయారన్నారు. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ స్వాతంత్ర్యం వారి త్యాగ ఫలాలేనని అభివర్ణించారు. నేటి యువత త్యాగధనులను మార్గదర్శకులుగా చేసుకొని నవభారత నిర్మాణానికి కృషిచేయాలన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ కోట్రికె హరికిషన్, తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛకు ప్రతీక తిరంగా జెండా

బనగానపల్లె రూరల్: జాతీయ పతాకం మన స్వేచ్ఛకు ప్రతీక అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కౌలస్యదేవి, పీడీ ఆంజనేయులు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ జెండా చేతపట్టి పట్టణంలోని ప్రధాన వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి




మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సహకరించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఈఓఆర్డీ మల్లికార్జున, డీటీ మారుతి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పురోగతి సూచిక 1.0 నుంచి (పీఏఐ) వెర్షన్ 2.0 పరివర్తన వ్యాప్తిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిశా నిర్దేశం మేరకు అందరూ బాధ్యతగా పనిచేసి 9 లక్ష్యాలను చేరుకొని గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో మహిళలు, ప్రజల భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

నీట మునిగిన పంటల పరిశీలన



చిన్నకొప్పెర్ల వద్ద నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



కోవెలకుంట్ల మండలం లింగాల వద్ద పొంగి పొర్లుతున్న పాలేరు వాగు

కోవెలకుంట్ల: ఉపరితల ఆవర్తన ప్రభావంతోపాటు శ్రీశైలం జలాశయం నుంచి కుందూనదికి భారీగా నీటిని విడుదల చేయడంతో రెండు రోజుల నుంచి నది, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నది పరివాహకంలో నీట మునిగిన పంటలను బుధవారం మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని చిన్నకొప్పెర్ల, వల్లంపాడు, లింగాల, రేవనూరు, గుళ్లదూర్తి, తదితర గ్రామాల పరిధిలో కుందూనది, పాలేరు, చిన్నవంక, ఇరుకుమాను, నల్లవాగుల కింద నీట మునిగిన వరి, మొక్కజొన్న, మినుము, తదితర పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో వాగుల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో సుమారు 500 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వాగుల్లో వరద ఉధృతి తగ్గి పంట పొలాల్లో చేరిన నీరు తొలిగిపోతే పూర్తి స్థాయిలో పంటనష్టం అంచనా వేసేందుకు అస్కారముంటుందని పేర్కొంటున్నారు.

అవయవదానంతో పునర్జన్మ



మాట్లాడుతున్న మహ్మద్ రఫీ

డోన్ టౌన్: అవయదానం చేసిన వారు మరణించి కూడా సమాజంలో జీవించి ఉంటారని ఇండియన్ రెడ్‌క్రాస్ డోన్ మండల చైర్మన్ వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ అన్నారు. ప్రపంచ అవయవదాన అవగాహన దినోత్సవం పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామ హైస్కూల్లో విద్యార్థులకు హెచ్ఎం అల్లీపీరా, స్కూల్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. మనిషి చనిపోయాక అవయవాలను ఇతరులకు దానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా మారొచ్చన్నారు. ప్రజలు మూఢ నమ్మకాలు వీడి అవయవదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వాతావరణ కాలుష్యంపై అవగాహన ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపై మువ్వన్నెల జెండా

డోన్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణ శివారులో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయ కొండపై 30 అడుగుల ఎత్తులో మువ్వన్నెల జెండాను ఏర్పాటుచేశారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు వీరాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు ఈ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేశారు. ఆగస్టు 15వ తేదీ వరకు కొండపై 30 అడుగుల ఎత్తులో మువ్వన్నెల జెండా రెపరెపలాడుతూ అందరినీ ఆకర్షించనుంది.



వీరాంజనేయస్వామి ఆలయ కొండపై మువ్వన్నెల జెండా రెపరెపలు